05ATP13_05ATP13.qxd 13-11-2025 PM 10:21 Page 1



# వారొచ్చి పట్టుకుంటుంటే.. వీరేమి చేస్తున్నట్లు..!

## పట్టుకోల్పోతున్న యాడికి పోలీసులు



ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రత్యేక బృందాలకు పట్టుపడిన అక్రమ ఇసుక వాహనాలు

**యాడికి(తాడిపత్రి), నవంబరు 13, ప్రభాతవార్త**

తమ పరిధిలో జరిగే అసాంఘిక పనులు, అదుపు తప్పుతున్న శాంతి భద్రతలను కట్టడి చేయాల్సిన యాడికి పోలీసులు పట్టుకోల్పోతున్నట్లు ప్రజల్లో వాదనలు వినిపిస్తున్నాయి. బయటి నుంచి వచ్చే పోలీసులకు కనిపిస్తున్న అసాంఘిక కార్యకలాపాలు, అక్రమ రవాణా ఇక్కడి పోలీసులకు కనిపించకపోవడం ఏమిటని విమర్శలు వినిపిస్తున్నాయి. ఎక్కడి నుంచో వస్తున్న పోలీసులు అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేస్తుంటే ఇక్కడి పోలీసులు ఏమి చేస్తున్నట్లు అనే చర్చ మండల వ్యాప్తంగా సాగుతోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో పెద్ద ఎత్తున తాడిపత్రి సబ్ డివిజన్‌కు చెందిన ప్రత్యేక పోలీసు బృందం ఇసుక అక్రమ రవాణా వాహనాలను స్వాధీనం చేసుకుంది. పది రోజుల కిందట రెండు అక్రమ ఇసుక రవాణా ట్రాక్టర్లను అదే ప్రత్యేక పోలీసు బృందం స్వాధీనం చేసుకొని స్థానిక పోలీసు స్టేషన్‌లో అప్పగించింది. తాడిపత్రికి నుంచి వచ్చిన వాహనాల తనిఖీ అధికారి నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న వాహనాలను మంగళవారం స్వాధీనం చేసుకొని స్థానిక పోలీసు స్టేషన్‌లో అప్పగించారు.

అడపా దడపా పేకాట రాయుళ్లను, బియ్యం అక్రమ రవాణాను ఈ ప్రత్యేక పోలీసు బృందాలే కట్టడి చేస్తున్నాయి. యాడికి మండలంలో చోటు చేసుకున్న చోరీల సొత్తు రికవరీపై కూడా జిల్లా పోలీసులే ఇటీవల తమ సామర్థ్యాన్ని ప్రదర్శించడం విశేషం. ఇక యాడికి పోలీసు స్టేషన్ పరిధిలో పోలీసు పికెట్ ఉన్న వెంగన్నపల్లి, కోనుప్పలపాడు గ్రామాల్లో కూడా తరచూ ఘర్షణలు చోటు చేసుకుంటుండటం ఇక్కడి పోలీసుల పనితీరుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. ఈ గ్రామాల్లో స్పెషల్ పార్టీ పోలీసులు పహారా కాయాల్సి వస్తోంది. పోలీసులకు ప్రజలకు మధ్య నమ్మకం సన్నగిల్లడం, పల్లెల్లో విజిబుల్ పోలీసింగ్ కనిపించకపోవడం, ఈ స్టేషన్‌లోని అధికారులకు, సిబ్బందికి మధ్య సమన్వయం కొరవడటం వెరసి పోలీసుల ప్రతిష్ట మసకబారుతోంది. ఉన్నతాధికారులు ఇప్పటికైనా కఠినంగా వ్యవహరించాలని స్థానికులు కోరుతున్నారు.

# అర్జీల ద్వారా వచ్చిన సమస్యలను పరిష్కరించండి

## - ఆర్డిఓ వసంతబాబు



ప‌త్రికా విలేకర్లతో మాట్లాడుతున్న ఆర్డిఓ వసంతబాబు

**బెలుగుప్ప, నవంబర్ 13 ప్రభాతవార్త**

మండల కేంద్రంలో గురువారం కళ్యాణదుర్గం ఆర్డిఓ వసంతబాబు ప్రజా సమస్యల వేదికపై ఇచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించండని తహశీల్దారు, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మండలంలో ఇళ్లకు సంబంధించిన స్థలాలపై లింకులు ఉంటే వెంటనే వాటిని పరిష్కరించి స్థలాన్ని కేటాయించి, రీ సర్వేలో భూ సమస్యలపైన పొలాలకు వెళ్లి పరిష్కరించాలని తెలిపారు. 10 మంది ఇచ్చిన అర్జీలను ఆర్డిఓ వసంతబాబు పరిష్కరించారు. అనంతరం విద్యార్థులకు ఆధార్‌సెంటర్‌ను హైస్కూల్‌లో ఏర్పాటు చేయాలని విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలియజేశారు. వెంటనే ఏర్పాటు చేస్తామని ఆర్డిఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు అనిల్‌కుమార్, డిప్యూటీ తహశీల్దారు మధుసూధన్‌రావు, రీ సర్వే తహశీల్దారు గురు బ్రహ్మ, ఆర్ఐ నగేష్, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వేగవంతంగా మౌలిక సదుపాయాల కల్పన



మౌలిక వసతుల కల్పనపై పర్యవేక్షిస్తున్న అధికార యంత్రాంగం



అధికారులకు సూచనలు ఇస్తున్న జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

**పుట్టపర్తి (కలెక్టరేట్) నవంబర్ 13, ప్రభాతవార్త**

భగవాన్ శ్రీ సత్య సాయి బాబా శత జయంతి ఉత్సవాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్ ఆదేశాల మేరకు.. పుట్టపర్తిలో ఏర్పాటు చేస్తున్న పార్కింగ్ ప్రదేశాలలో వేగవంతంగా అధికారులు పనులను పూర్తి చేస్తున్నారు. గురువారం వివిధ పార్కింగ్ ప్రదేశాలలో రహదారి అభివృద్ధి, త్రాగునీటి ట్యాంకర్లు, తాత్కాలిక మరుగుదొడ్లు, సూచిక బోర్డు ఏర్పాటు, ఇతరత్రా పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు ఆయా శాఖల అధికారులు సిబ్బంది కృషి చేస్తున్నారు. అలాగే పారిశుధ్య పనులను కూడా చేశారు. ఈ పనులను కలెక్టర్ ఆదేశాల మేరకు జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఆర్డీవోలు సువర్ణ, వివిఎస్ శర్మ స్వయంగా పర్యవేక్షణ చేయడం జరుగుతోంది. ఈ సందర్భంగా ఇంకను పూర్తి చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు తగు సూచనలు జారీ చేశారు.

## తెదేపా కమిటీ సభ్యుల ప్రమాణస్వీకారానికి తరలిరండి

### మండల అధ్యక్షులు లక్ష్మీనరసప్ప



లక్ష్మీనరసప్ప

**గుడిబండ నవంబర్ 13 ప్రభాతవార్త**

మడకశిర పట్టణంలోని ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయంలో నేడు శుక్రవారం నిర్వహించే తెలుగుదేశం పార్టీ కమిటీ సభ్యుల ప్రమాణస్వీకారానికి మండలంలోని తెలుగుదేశం పార్టీ కమిటీ సభ్యులు హాజరవ్వాలని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మీనరసప్ప తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని తెలుగుదేశం పార్టీ మండల కమిటీ సభ్యులు, క్లస్టర్ ఇంచార్జీలు, గ్రామ పంచాయతీ కమిటీ సభ్యులు, అనుబంధ కమిటీల సభ్యులు హాజరై ప్రమాణ స్వీకారం చేసి తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# అక్రమ కేసును తొలగించండి



ఏఎస్పీతో పరిశీలించి తగిన చర్యలు తీసుకోమంటున్న ఎస్పీ జగదీష్

**యాడికి(తాడిపత్రి), నవంబరు13, ప్రభాతవార్త**

తనపై యాడికి పోలీసులు నమోదు చేసిన అక్రమ కేసును పరిశీలించి తన పేరును తొలగించాలని తాడిపత్రి 'వార్త' ఆర్‌సీ ఇన్‌ఛార్జి రామకృష్ణ గురువారం ఎస్పీ జగదీష్‌ను కోరారు. తనకు ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని ప్రమేయం లేకపోయినా ఈ ఏడాది మార్చి 16న మాదాల భాస్కర్ అనే వ్యక్తి భూమికి సంబంధించిన సమస్యలో తనపై తప్పుడు ఫిర్యాదు చేయగా ఎలాంటి ప్రాథమిక ఆధారం లేకపోయినా తనపై కేసు నమోదు చేశారని ఆయన ఎస్పీకి వివరించారు. తన భూ సమస్యపై ఫిర్యాదుదారుడు 12వ తేదీ యాడికి పోలీసులకు ఇచ్చిన మొదటి ఫిర్యాదు లోనూ, 14వ తేదీ ఎస్పీ కార్యాలయంలో ఇచ్చిన ఫిర్యాదులోనూ తన పేరు లేదని, 16వ తేదీ ఇచ్చిన చివరి ఫిర్యాదులో కొందరు వ్యక్తుల ఒత్తిడితో యాడికి సీఐ తనపై కేసు నమోదు చేశారని ఎస్పీకి బాధిత విలేకరి విశదీకరించారు. 16 ఏళ్లుగా సామాజిక బాధ్యతగల వృత్తిలో పనిచేస్తున్న తన తీరును పరిశీలించి, ఈ కేసులో నా ప్రమేయంపై విచారించి తగిన న్యాయం చేయాలని ఆయన కోరారు. ఈ విషయాన్ని సావధానంగా విన్న ఎస్పీ జగదీష్ దీనిపై విచారించి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరికి సూచించారు.

# ధర్మవరం ప్రజలను మీ నుండి కాపాడేందుకు జాగిలాలుగా పనిచేస్తున్నాం...!

- కసాయి పనులు చేసే వారి కాళ్లు విరగగొడతాం...!
- ఐదేళ్ల వైసీపీ చేయలేని అభివృద్ధి 16నెలల్లో బీజేపీ చేసి నిరూపించింది...!
- ఇతరులపై మాట్లాడేటప్పుడు ఒళ్లుదగ్గరపెట్టుకో కేతిరెడ్డి.
- కేతిరెడ్డిపై బీజేపీ నేత హరీశ్ బాబు ధ్వజం



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీనాయకులు.

**ధర్మవరం, నవంబరు 13 (ప్రభాతవార్త)**

ధర్మవరం ఆర్డీవో కార్యాలయం వద్ద వైసీపీ పార్టీ నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ బిజెపి కార్యకర్తలను జాగిలాలుగా పోల్చడం జరిగిందని. బీజేపీ కార్యకర్తలను జాగిలాలు పోల్చావ్ కేతిరెడ్డి కానీ ఆ జాగిలాలే ఈ దేశభద్రత కోసం ప్రాణాలు అర్పిస్థాయన్నారు. ధర్మవరం ప్రజలను కాపాడుకునేందుకు బిజెపి కార్యకర్తలు విశ్వాసం ఉన్న జాగిలాలు మాదిరిగానే పనిచేస్తున్నారన్నారు. మీ దగ్గర ఉన్న జాగిలాల మాదిరి ప్రజల మాంసపు ముద్దలను కొరుక్కు తినే కసాయి నా కొడుకులు కాదు అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ధర్మవరం ప్రజల కోసం తాము వెంకయ్యనాయుడు వద్ద లాబీయింగ్ చేస్తున్నాం మీ లాగా తిన్నింటి వాసాలు లెక్కపెట్టే పరిస్థితి మాకులేదన్నారు. బీసీలపై విమర్శలు చేసిన వారు ఎప్పుడూ రాజకీయంగా బాగుపడినదాఖలాలు లేవన్నారు. అందుకే మీరు ఎథిక్స్‌ని వ్యక్తిగా మిగిలి పోతున్నారని ఆయన ఎద్దేవాచేశారు. మెడికల్ కాలేజీల నిదుల విషయంలో రూ.700 కోట్లు దోచుకున్నారని చెప్పడం పూర్తిగా అవాస్తవమన్నారు.ఐదేళ్ల వైసీపీ చేయలేని అభివృద్ధి కేవలం 16నెలల్లో బీజేపీ చేసి నిరూపించుకుందని బీజేపీ నియోజకవర్గఇన్చార్జ్ హరీశ్బాబుతెలిపారు. స్థానిక ఎన్డీఏ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో బీజేపీ నాయకులతో కలిసి హరీశ్ బాబు మాట్లాడారు.. కేతిరెడ్డి ఇతరులపై మాట్లాడేటప్పుడు ఒళ్లు దగ్గరపెట్టుకుని మాట్లాడాలన్నారు. ప్రజల జోలికివచ్చిన వారిపై కన్నెత్తి చూసినట్టు ఆధారాలు దొరికితే బట్టలూడదీసి వారితోనే కొట్టిస్తాను అని హెచ్చరించారు. మంత్రిసత్యకుమార్ యాదవ్ 16నెలల కాలంలోనే నిదులు తీసుకువచ్చి ధర్మవరంను అభివృద్ధికి పునాది వేశారన్నారు. రూ.29.30కోట్లతో అమృత్పథకం కింద నీటి సరఫరా మెరుగుదల పనులు, 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా పలు ప్రాజెక్టులు చేపట్టిన ఘనత సత్యకుమార్దేనన్నారు. అభివృద్ధిని ప్రోత్సహించాల్సిన కేతిరెడ్డి చిల్లర మాటలు మాట్లాడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు జింకాచంద్రశేఖర్: గొట్లూరు చంద్ర, సాకె ఓబుళేశు. నబీరసూల్, లక్ష్మీనారాయణ, బిల్లేశీన, భక్తవత్సలంనాయుడు పాల్గొన్నారు.

## నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**శింగనమల, నవంబర్ 13 ప్రభాతవార్త**

నేటి నుంచి 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు శింగనమల గ్రంథాలయ అధికారి జి.కృష్ణ పేర్కొన్నారు. అందులో భాగంగా గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులతో కలిసి గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం గ్రంథాలయ అధికారి జి.కృష్ణ మాట్లాడుతూ.. నేటి నుంచి ఈ నెల 20వ తేది వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి, చివరి రోజున బహుమతులు ప్రధానం చేయడం జరుగుతుందని, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు త్యాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బీసీలను మభ్యపెడుతున్న చంద్రబాబు

### సాకేనరేష్ విమర్శ

**అనంతపురం కల్చరల్, నవంబర్ 13 ప్రభాతవార్త**

అధికారంలోకి వస్తే బీసీలకు రక్షణ చట్టం, బీసీ సబ్ ప్లాన్, ఆదరణ అమలు చేస్తామని చెప్పి ఇప్పుడు రోజుకు ఒక ప్రకటన చేస్తూ బీసీలను మభ్యపెడుతున్నాడని బీసీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు సాకేనరేష్ విమర్శించారు. స్థానిక జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు బీసీలకు అనేక హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బీసీలను విస్మరించారని ఒక్క హామీ కూడా అమలు చేయలేదని కేవలం ఓటు బ్యాంకు యంత్రాలుగా బీసీలను వాడుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు, అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీ కార్పొరేషన్ల ద్వారా లోన్లు ఇస్తామని అప్లికేషన్లు సేకరించి ఇంతవరకు లోన్లు ఇవ్వకుండా బీసీలను కార్పొరేషన్ చుట్టూ తిరిగే విధంగా చేస్తున్నారన్నారు, బీసీలకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రామాంజినేయులు, ఉపాధ్యక్షుడు ఆదినారాయణ, పోతలయ్య, నరసింహులు, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

# నివాళులర్పించిన రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

**నల్లచెరువు నవంబర్: 13 ప్రభాత వార్త**

మండల పరిధిలోని చిన్న యల్లం పల్లికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు గాలివీటి శ్రీరాములు నాయుడు అనారోగ్యంతో ఈనెల 6వ తేదీ మృతి చెందిన విషయం తెలిసిందే.. అయితే గురువారం రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత చిన్న ఎల్లంపల్లిలో గాలివీటి శ్రీరాములు నివాసం కు వచ్చి శ్రీరాములు నాయుడు చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులైన గాలివీటి కృష్ణ మోహన్ నాయుడుతో పాటూ.. కుటుంబ సభ్యులను పరామర్శించారు...

### ఫ్రెండ్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో

## ఉచితంగా దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

**తలుపుల,నవంబర్13, ప్రభాతవార్త**

మండల పరిధిలోని మారుమూల గ్రామాలైన భూపతివారిపల్లి, చంద్ర నాయక్ తాండ గ్రామాలలో రూరల్ డెవలప్మెంట్ గురువారం ఫ్రెండ్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద ప్రజలకు,దివ్యాంగులకు, వ్యాధిగ్రస్తులకు దుప్పట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఈ సందర్భంగా ఫ్రెండ్స్ ట్రస్ట్ ఫౌండర్ మన్సూర్ మాట్లాడుతూ చలికాలం ప్రారంభం అవ్వడంతో చలి తీవ్రత ఎక్కువ ఉన్న ప్రాంతాలు కాబట్టి పేద ప్రజలు చలితో ఇబ్బంది పడకూడదని ఉద్దేశంతో తమవంతు సహాయంగా ఫ్రెండ్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు.ఏమైనా పేద ప్రజలకు సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే తమ వంతు పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. మీ అందరి సహకారంతో భవిష్యత్తులో పేద ప్రజలకు మరింత సేవా కార్యక్రమాలు చేస్తామని తెలియజేశారు. దుప్పట్లు పంపిణీ చేయడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ ట్రస్టు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు ప్రకాష్, వేణు, అంగన్వాడీ టీచర్, ఆశా కార్యకర్త, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పరిశుభ్రతతోనే ఆరోగ్య సంరక్షణ



కమిషనర్ మాట్లాడుతున్న దృశ్యం

**గుత్తి,నవంబర్ 13 ప్రభాతవార్త**

పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తద్వారా ఆరోగ్యానికి సంరక్షించుకోవచ్చునని మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా పేర్కొన్నారు. స్థానిక శ్రీ సాయి జూనియర్ కళాశాలలో మన పరిశుభ్రతమన ఆరోగ్యం అన్న అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ కుటుంబీకులకు తడిచెత్త,పొడిచెత్త,ప్రమాదపు చెత్తలను వేరుచేసే విధానం పట్ల అవగాహన కల్పించాలన్నారు. పట్టణ పరిశుభ్రత అందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ మహబూబ్‌బాషా,ఉపాధ్యాయులు,శానిటేషన్‌కార్యదర్శులు పాల్గొన్నారు.

## పట్టుబడిన అక్రమ మద్యం, సారా ధ్వంసం



నాటుసారా,అక్రమమద్యంను ధ్వంసం చేస్తున్న దృశ్యం

**గుత్తి,నవంబర్ 13 ప్రభాతవార్త**

గుత్తి ఎక్సైజ్ సర్కిల్, సివిల్ పోలీస్ స్టేషన్, గుంతకల్ వన్ టౌన్ మరియు టూ టౌన్, కసాపురం పోలీస్ స్టేషన్ల పరిధిలో పట్టుబడిన అక్రమ మద్యం నాటు సారాల ను గురువారం ఎక్సైజ్ మరియు సివిల్ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు.ఈ సందర్భంగా 48 కేసులలో 300 లీటర్లు నాటు సారా, ఏడు లీటర్ల కర్ణాటక మద్యం, 100 లీటర్ల డిపిఎల్ మద్యం ధ్వంసం చేశారు.ఈ ఎక్సైజ్ సీఐ ఉమాదేవి, ఎస్సై గోపాల్ పాల్గొన్నారు

## 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

**గుత్తి,నవంబర్ 13 ప్రభాతవార్త**

గుత్తి పట్టణంలోని పౌర శాఖ గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాల అధికారి రామాంజనేయులు తెలిపారు.

గురువారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ 14న బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన పుస్తక పఠన ప్రాముఖ్యత,16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులకు నివాళులు, 17 న కవి సమ్మేళనాలు సెమినార్లు 18 న విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీల నిర్వహణ 19న మహిళలకు పోటీలను నిర్వహిస్తామన్నారు. ఈ ఉత్సవాలను పుస్తక ప్రేమికులు, ప్రజలు విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## వైయస్ జగన్‌ను కలిసిన వెంకటేష్



వైఎస్ఆర్సిపి అధినేత మాజీ ముఖ్యమంత్రిని కలిసిన వెంకటేష్

**అనంతపురం రూరల్, నవంబర్ 12 ప్రభాతవార్త**

వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని అనంత రూరల్ మండలం రాచనపల్లి పంచాయతీ వైస్సార్సీపీ నాయకులు వెంకటేష్ కలిసారు. బుధవారం వైసిపి కేంద్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రాప్తాడు నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసిపి అభ్యర్థులను గెలిపించు కుంటామని వెంకటేష్ తెలిపారు. అలాగే రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎప్పటి కప్పుడు ఎండగడుతూ, 2029లో జరగ బోయే ఎన్నికలలో వైసిపి పార్టీని గెలిపించు కొని వైయస్ జగన్‌ను మరొమారు ముఖ్యమంత్రిని చేసుకుంటామన్నారు.

# అన్నదాన కార్యక్రమానికి రూ. 15 వేలు అందించిన ఎం ఎస్ ఎస్ సేవా సంస్థ

- కులమతాలకతీతంగా ఎం ఎస్ ఎస్ సేవా సంస్థ సేవా కార్యక్రమాలు
- సంస్థ అధ్యక్షులు ఎం ఎస్ ఎస్ సాదిక్ వలి. ఎంపీటీసీ మహబూబ్ బీ



అన్నదాన కార్యక్రమానికి రూ. 15 వేలు బ్యాంకు చెక్కును ఆలయ కమిటీ సభ్యులకు అందజేస్తున్న దృశ్యం.

**అనంతపురం రూరల్, నవంబర్ 13 ప్రభాతవార్త**

అనంత రూరల్ మండలం రుద్రంపేటగ్రామపంచాయతీలో ఎం ఎస్ ఎస్ సేవా సంస్థ ఆధ్వర్యంలో కులమతాలకు, పార్టీలకు అతీతంగా అనేక సేవా కార్యక్రమాలతో పాటు, గుడులు, మసీదులు, చర్చిలలో నిర్వహించే వివిధ కార్యక్రమాలకు ఆర్థిక సహాయంతో పాటు సేవలు చేయడం జరుగుతుందని ఆ సంస్థ అధ్యక్షులు ఎం ఎస్ ఎస్ సాదిక్ వలి, ఎంపీటీసీ మహబూబ్ బీ తెలిపారు. గురువారం ఎం ఎస్ ఎస్ సేవా సంస్థ ఆధ్వర్యంలో రుద్రంపేట పంచాయతీ, వికలాంగుల కాలనీ, అజయ్ గౌస్ కాలనీలో మరకత లింగ శివపార్వతి సమేత విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం ఆలయ కమిటీ సభ్యులు, స్థానికప్రజలునిర్వసిస్తుండడంతో ఈ కార్యక్రమానికి విచ్చేసే ప్రజలు భక్తులకు,అన్నదాన కార్యక్రమము చేపట్టాలని కోరుతూ ఎంఎస్ఎస్ సేవా సంస్థ, మరియు రుద్రంపేట వైయస్సార్సీపి ఎంపీటీసీ మహబూబ్ బీ చేతుల మీదుగా రూ.15, వేలు బ్యాంకు చెక్కును ఆలయ కమిటీ వారికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రుద్రంపేట గ్రామ పంచాయతీలోని పేద ప్రజలకు అనేక విధాలుగా ఎం ఎస్ ఎస్ సేవా సంస్థ అండదండలుగా నిలుస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పాటు ఆర్థిక సహాయం అందిస్తూ ముందుకు సాగడం జరుగుతుందన్నారు. అందులో భాగంగానే వికలాంగుల కాలనీ, అజయ్ గౌస్ కాలనీలో ఏర్పాటు చేస్తున్న శివపార్వతుల విగ్రహ ప్రతిష్టకు విచ్చేసే భక్తులకు ప్రజలకు అన్నదానం కార్యక్రమం నిర్వహించాలని కోరుతూ ఆలయ కమిటీ సభ్యులకు రూ. 15 వేలు బ్యాంకు చెక్కు నుఅందించడంజరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపి పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ సాదిక్ వలి మరియు ఆలయ కమిటీ సభ్యులు ప్రెసిడెంట్, ఆ వేట రామ్మూర్తి, వైస్ ప్రెసిడెంట్, గవ్వల శ్రీనివాసులు,సెక్రటరీ, వరుణ్ చౌదరి జాయింట్ సెక్రెటరీ, మాల పరంధామ ట్రెజరర్, బసినేని వెంకటేశులు కార్యదర్శి, ముట్టాల పెద్దన్న, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## పరిటాల శ్రీరాములు కలిసిన ఎస్టీ కమిషన్ సభ్యులు



పరిటాల శ్రీరామ్ ను కలిసిన ఎస్టీ కమిషన్ సభ్యులు తదితరులు.

**అనంతపురం రూరల్, నవంబర్ 13 ప్రభాతవార్త**

తెలుగుదేశం పార్టీ యువ నాయకులు,ధర్మవరం ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ ని ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ సభ్యులు పి వెంకటప్ప గురువారం మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేసి అలాగే ఈనెల 17 న విజయవాడలో జరిగే ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ఆహ్వానించిన ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ సభ్యులు పి వెంకటప్ప వారితోపాటు తెలుగుదేశం పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే వీరాంజనేయులు, తెలుగు యువత సభ్యులు సాకే లక్ష్మీనరసింహ, మహేష్, కృష్ణ పాల్గొన్నారు.

## రాచనపల్లి బూత్ కన్వీనర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన పసల ఆదినారాయణ

**అనంతపురం రూరల్, నవంబర్ 13 ప్రభాతవార్త**



ఎమ్మెల్యే పరిటాల సునీతకు కృతజ్ఞతలు తెలుపుతున్న పసల ఆదినారాయణ

అనంత రూరల్ మండలం రాచానపల్లి గ్రామపంచాయతీ బూత్ కన్వీనర్ గా డీలర్ పసల ఆదినారాయణ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే పరిటాల సునీత నా మీద నమ్మకంతో తిరిగి మళ్లీ రెండోసారి నా చానపల్లి పంచాయతీ బూత్ కన్వీనర్ గా ఎంపిక చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్యే నామీద నమ్మువద్దు ఇచ్చిన పదవికి న్యాయం చేయడంతో పాటు రాచానపల్లిలో పార్టీని మరింత బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ప్రమాణ స్వీకార అనంతరం ఆయన ఎమ్మెల్యే పరిటాల సునీతకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## రైతు సేవా కేంద్రాన్ని పరిశీలించిన ఏ డి ఏ

**అనంతపురం రూరల్, నవంబర్ 13 ప్రభాతవార్త**



చోరీ జరిగిన రైతు సేవ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏ డి ఏ

రాప్తాడు మండలం మరూ రు గ్రామపంచాయతీలో గల రైతు సేవా కేంద్రం తాళం పగలగొట్టి ఆ కేంద్రంలో గల టీవీని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకు వెళ్లడంతో, ఆ విషయం తెలుసుకున్న ఏడిఏ జియం అల్తాఫ్ అలీఖాన్, స్థానిక ఏవో కృష్ణ చైతన్యతో రైతు సేవా కేంద్రానికి వెళ్లి పరిశీ లించి, స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## నేటి నుంచి 58వ గ్రంథాలయ వారోత్సవాలు

**నంబులపూలకుంట, నవంబర్ 13 ప్రభాతవార్త**

ఈ నెల 14 (నేటి శుక్రవారం) నుంచి నవంబర్ 20వ తేది వరకు 58వ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు మండల గ్రంథాలయ అధికారి పరేయభాను తెలిపారు. ఈ సందర్భంగా ఆమె తెలియజేస్తూ.. అక్షర సమాజం పుట్టిన నాటి నుంచి గ్రంథాలయాలు జీవన వికాసానికి, సామాజిక పురోగతికి సోపానాలుగా, మానవ పరిణామాన్ని ఆవిష్కరిస్తుంటే, గ్రంథాలయాలు ఆ లక్ష్యాలను మరింతగా విస్తరిస్తూ వివేకవంతమైన తరాన్ని రూపొందించటంలో అవిరామ కృషిని కొనసాగిస్తున్నాయి. గ్రంథాలయాలు అందిస్తున్న సేవలను ప్రజలకు తెలియజేయడం, నేటి తరాలను గ్రంథాలయాలకు సన్నిహితం చేయడమే ధ్యేయంగా, పౌర గ్రంథాలయ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తుంది. 14న గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభ వేడుకలు, బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన ఏర్పాటు, పుస్తక పఠన ప్రాముఖ్యత, 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన ప్రముఖులు డా.ఎఫ్ఆర్.రంగనాథన్, పోతులూరి నాగభూషణం, వెంకటరమణయ్యలను స్మరించుట, 17న కవిసమ్మేళనాలు, సెమినార్లు, రచయితల సందేశాలు, 18న పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు చిత్ర లేఖనం, వ్యాసరచన, వక్తృత్వ క్విజ్, క్రీడా పోటీలు, 19న మహిళలకు వివిధ కార్యక్రమాలపై పోటీలు నిర్వహించుట, రంగవల్లి, అల్లికలు 20న డిజిటల్ గ్రంథాలయాలపై విద్యార్థులకు అవగాహన, సామాజిక స్వీయ పఠము (ఐ లవ్ రీడింగ్) వారోత్సవాములు గింపు వేడుకలు నిర్వహించడం జరుగుతుందని గ్రంథాలయ అధికారి పరేయభాను తెలిపారు.

06ATP27_06ATP27.qxd 13-11-2025 PM 10:21 Page 1



# వ్యవసాయం శాస్త్రీయ బద్ధంగా చేస్తే అనుకున్న ఫలితాలు

**-ఎన్ఎంఈఓ-ఓఎస్ శిక్షణా తరగతుల్లో జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ -హాజరైన రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు మల్లేశ్వరి, కిషోర్‌రెడ్డి**



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ

**ఉరవకొండ, నవంబర్ 13 ప్రభాతవార్త**

వ్యవసాయంను శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారుల సలహాలు, సూచన లు పాటిస్తూ చేస్తే పెట్టుబడుల ఖర్చులు తగ్గి మంచి దిగుబ డులు సాధించడానికి వీలుంటుందని జిల్లా వ్యవసాయాధి కారి ఉమామహేశ్వరమ్మ అన్నారు. మండల పరిధిలోని కౌకుంట్ల గ్రామంలో గురువారం జాతీయ నూనె గింజల ఉత్పత్తి పథకముపై రెడ్డిపల్లి కృషి విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో రైతులకు శిక్షణాకార్యక్రమం జరుగగా ఆమెతో పాటు కృషివిజ్ఞానకేంద్రం శాస్త్రవేత్తలు మల్లేశ్వరి,కిషోర్‌రెడ్డి ముఖ్య అతిధులు గా హాజరయ్యారు. ఈసందర్భంగా జిల్లావ్యవసాయాధికారి ఉమామహేశ్వ రమ్మ మాట్లాడుతూ ఈ ఏడాది వేరుశెనగలో ఆశించిన మేర దిగుబడులు సాధించడం జరిగిందన్నారు. పప్పుశెనగలో వచ్చే కుళ్లుతెగులు నివారణకు గాను ముందస్తుగా ట్రైకోడెర్మా విరిడితో విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. లేనిపక్షంలో ఎవర్‌గోల్డ్ ఎక్స్ట్రా అనే మందు 100ఎంఎల్‌తో ఒక క్వింటాల్ పప్పుశెనగను విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. కందిలో వచ్చే పూతలో పురుగుల నివారణకు కొరజిన్ 60ఎంఎల్ మందును 100 లీటర్ల నీటితో కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త మల్లేశ్వరి మాట్లాడుతూ వేరుశెనగ సాగు పద్ధతులు, యాంత్రీకరణ, సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై అవగాహన కల్పించారు. కిషోర్‌రెడ్డి మాట్లాడుతూ వివిధ పంటల్లో వచ్చే చీడపీడలు వాటి నివారణ, యాజమాన్య పద్ధతుల గూర్చి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ ఏడీఏ సత్యనారాయణ, ఏవోలు రామకృష్ణుడు, రాకేష్‌నాయక్, ఏఈవో వెంకటనారాయణ, ఎంపీఈవో ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# మురుగునీటి సమస్య పరిష్కారానికి తాత్కాలిక మట్టి కాలువ

**-పరిశీలించిన ఎంపీడీవో బి.వి.రవిప్రసాద్, కార్యదర్శి ఎ.గౌస్‌సాహెబ్**

**ఉరవకొండ, నవంబర్ 13 ప్రభాతవార్త**



పేరుకుపోయిన మురుగును పరిశీలిస్తున్న ఎంపీడీవో బి.వి.రవిప్రసాద్, మేజర్ పంచాయతీ కార్యదర్శి ఎ.గౌస్‌సాహెబ్

పట్టణ బైపాస్ కె.కె.ఫిల్లింగ్ స్టేషన్ వెనుక ప్రైవేటు స్థలం లోకి చేరుతున్న మురుగు, వర్ష పునీటిని మళ్లిం చడానికి గాను తాత్కాలికంగా మట్టి కాలువను నిర్మించడానికి చర్యలు తీసుకొం టున్నామని మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎ.గౌస్‌సాహెబ్ తెలిపారు. గురువారం ఆయన ఎంపీడీవో బి.వి.రవి ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఐ.ఐజయ్యతో కలిసి మట్టి కాలువ నిర్మించడానికి తీసుకోవాల్సిన చర్యలపై క్షేత్రపరిశీలన చేశారు. ఈసందర్భంగా పంచాయతీ కార్యదర్శి ఎ.గౌస్‌సాహెబ్ మాట్లాడుతూ ప్రధానంగా పట్టణం నుండి వస్తున్న మురుగునీరు, వర్షపునీరు కె.కె.ఫిల్లింగ్ స్టేషన్ వెనుక చేరుతుండటంతో ఆ ప్రాంతం వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ సమస్య పరిష్కారానికి అనేకమార్లు పంచాయతీకు విన్నవించడం జరిగిందన్నారు. ఈ క్రమంలో తాత్కాలిక మట్టి కాలువ నిర్మించడానికి చర్యలు తీసుకోవడం జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్యారం కేశవానంద, కట్టుబడి ఖలంధర్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# సైన్స్ సెమినార్ రాష్ట్రస్థాయి పోటీలకు ధర్మవరం విద్యార్థి ఎంపిక

**ధర్మవరంటౌన్, నవంబరు 13 ప్రభాతవార్త**



సైన్స్ సెమినార్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థితో పాఠశాల హెచ్‌ఎం, సైన్స్ ఉపాధ్యాయులు

ధర్మవరం పట్టణంలోని శాంతినగర్ మున్సిపల్ ఉన్నతపాఠశాలలో 10వతరగతి చదువుతున్న శంకరవు గణేశ్ సైన్స్ సెమినార్ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల హెచ్‌ఎం ఉమాపతి, సైన్స్ ఉపాధ్యాయులు ఎస్బీరేఖ, ప్రదీప్ కుమార్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి గణేశ్ ను గురువారం పాఠశాలలో వారు అబినందించారు. అనంత రం వారు మాట్లాడుతూ.... గత నెల 17వతేదీన విజయవాడలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన సైన్స్ సెమినార్లో ప్రతిభ కనబరచారన్నారు. ఈ విద్యార్థి క్వాంటమ్ ఏజ్ బిగెన్స్, పొటెన్సియల్స్ అండ్ చాలెంజెస్ అనే అంశంపై ఇచ్చిన సెమినార్ కు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. క్వాంటమ్, జనరల్ కంప్యూటర్ మధ్య గల తేడా వివరించడం జరిగిందన్నారు. దీంతో విద్యార్థి గణేశ్ ను సమగ్రశిక్ష తరపున డిసెంబరు 27 నుంచి జనవరి 4వతేదీ వరకు గుజరాత్‌కు సైన్స్ టూరు వెళ్తున్నట్లు హెచ్‌ఎం. సైన్స్ ఉపాధ్యాయులు తెలిపారు.

# నేటి నుండి మహాలక్ష్మి మరియు భూతప్ప స్వామిల కార్తీక కుంభాభిషేక వేడుకలు

**అమరాపురం నవంబర్ 12 ప్రభాతవార్త**



మండల పరిధిలో బసవనపల్లి గ్రామంలో వెలసిన మాత మహాలక్ష్మి మరియు భూతప్ప స్వాముల దేవాలయాల్లో కార్తీకమాసం కుంబాభిషేకం మరియు దీపోత్సవ వేడుకలు ఈనెల 13 నుండి 15 వరకు వైభవంగా నిర్వహిస్తున్నట్లు దేవాలయ యజమానులు, ట్రస్ట్ కమిటీ అధ్యక్షుడు పరమేశ్వరప్ప, ఉపాధ్యక్షుడు ఎం.డైరీ రాజశేఖర్, కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి దేవరాజ్ మరియు దేవాలయ యజమానులు తెలిపారు. నేడు ఆలయ శుద్ధికరణ మరియు అన్నసంతర్పణ, 14 శుక్రవారం శ్రీమాతా మహాలక్ష్మి అమ్మవారికి కార్తీక మాసం కుంబాభిషేకం మహ మంగళహారతి సాయంత్రం 6 గంటలకు దీపోత్సవ కార్యక్రమాలు, 15న భూతప్ప స్వామి దేవాలయంలో విశేష పూజలు మరియు తీర్థప్రసాదాలు వినియోగం కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా భక్తాదులు దేవాలయ అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందించాలని అధ్యక్షులు ,ఉపాధ్యక్షులు, కమిటీ సభ్యులు, దేవాలయ యజమానులు కోరారు. అమ్మవారి కుంభాభిషేకం మరియు దీపోత్సవ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# గ్రంధాలయ వారోత్సవాలను విజయవంతం చేయండి

**గ్రంథాలయ అధికారి సీనా నాయక్**

**తాడిమర్రి నవంబర్ 13 (ప్రభాతవార్త)**



వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న గ్రంథాల అధికారి శీన నాయక్

నేటి నుండి (శుక్రవారం) నవంబర్ 20వ తారీకు వరకు మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న 58 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలని గ్రంథాలయ అధికారి సీనా నాయక్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు అరుణ, పర్వీన్ భానుల ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్లను విడుదల చేశారు. ఈ వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శన, వ్యాసరచన పోటీలు, కవి సమ్మేళనాలు, సెమినార్లు, రచయితల సందేశాలు వంటి వాటికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మహిళలకు విద్యార్థిని విద్యార్థులకు అనేక అంశాలపై పోటీలు నిర్వహించి తగిన ప్రోత్సాహక బహుమతులు అందజేయడం జరుగుతుందని అన్నారు. కావున కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అమరాంజనేయులు, నాయక్, వెంకటరమణ నాయక్, వెంకటరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి సత్య కుమార్ యాదవ్ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలు

**బిజెపి మండల కన్వీనర్ దేవర రామ్మోహన్**

**తాడిమర్రి, నవంబర్ 13 (ప్రభాతవార్త)**



సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి మండల కన్వీనర్ దేవర రామ్మోహన్

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో తాడిమర్రి మండలంలో అభివృద్ధి సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తూ ప్రజల మన్ననలను పొందుతూ ఉంటే వైసీపీ నాయకుల్లో కలవరం మొదలై మంత్రి సత్య కుమార్ యాదవ్ పై అవాకులు చావాకులు పేలుతున్నారని బిజెపి మండల కన్వీనర్ దేవర రామ్మోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మండల కేంద్రంలోని బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ధర్మవరం నియోజకవర్గంలో మంత్రి సత్య కుమార్ యాదవ్ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు కళ్ళ ముందు కనపడుతూ ఉంటే వైసీపీ నాయకులు మండల యూత్ కన్వీనర్ సిద్దేమోహన్ రెడ్డి మాత్రం మంత్రి సత్య కుమార్ యాదవ్ పై అసత్య ఆరోపణలు చేయడం దుర్మార్గమని అన్నారు. ధర్మవరం నియోజకవర్గ అభివృద్ధి సంక్షేమం కోసం మంత్రి సత్య కుమార్ యాదవ్ అహర్నిశలు కృషి చేస్తున్నారని ఆయన చొరవతో తాడిమర్రి మండలంలో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని అన్నారు. అందులో భాగంగా నార్సింపల్లినిడిగిల్లు, పిన్నదరి తాడిమర్రి గ్రామాల రహదారుల నిర్మాణం కోసం 5 కోట్ల రూపాయలు అలాగే మాల్యవంతందాడితోట మరియు చిల్ల కొండయ్య పల్లినల్లపరెడ్డిపల్లి రహదారుల నిర్మాణం కోసం 5 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. అలాగే తాడిమర్రి మోదుగులకుంట, పిన్నదరిఅక్కమ్మ గారి కొండ, బీటీ రోడ్లకు నిధులు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో సిసి రోడ్ల నిర్మాణంకోసం 3కోట్లరూపాయలు మరియు తాడిమర్రి ప్రభుత్వ ఆసుపత్రిలో పబ్లిక్ బ్లాక్ హెల్త్ యూనిట్ నిర్మాణానికి 48 లక్షల రూపాయలు, కేజీబీవీలో అదనపు గదుల నిర్మాణంకోసం కోటి 20 లక్షల రూపాయలు, ఎస్సీ, బిసి, బాలుర వసతి గృహాల్లో మరమ్మత్తుల కోసం 20 లక్షల రూపాయలు మంజూరు చేసిన ఘనత మంత్రి సత్య కుమార్ యాదవ్ కే దక్కుతుందని అన్నారు. అలాగే కమ్యూనిటీ భవనాలు, పలు దేవాలయాల దగ్గర స్వచ్ఛ భారత్ మిషన్ పథకం కింద సుమారు 3 లక్షల రూపాయల వ్యయంతో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టడం జరిగిందని అన్నారు. అలాగే పీఏబీఆర్ ప్రాజెక్టు గేట్ల మరమ్మతులకు మరో 29, లక్షల రూపాయలు మంజూరు చేయించడం జరిగిందని అన్నారు. అభివృద్ధి కోసం అనునిత్యం పాటుపడే వారిపై విమర్శలు చేయడం సిగ్గుచేటని ఇప్పటికైనా వైసీపీ నాయకులు నిజా నిజాలు తెలుసుకొని మాట్లాడితే ప్రజలు హర్షిస్తారని, ఇలాగే ప్రవర్తిస్తే ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు.

# గ్రంథాలయంలో గోడపత్రికలు విడుదల



గోడపత్రికలు విడుదల చేస్తున్న దృశ్యం.

**గోరంట్ల నవంబర్ 13 ప్రభాతవార్త**

గోరంట్ల స్థానిక శాఖా గ్రంథాలయం నందు 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు పురస్కరించుకొని జాతీయ గ్రంథాలయ వారోత్సవాల గోడ పత్రికలను మండల విద్యాశాఖ అధికారి శ్రీ గోపాల్ అతిథిగా విచ్చేసి గోడ పత్రికను ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షులు రిటైర్డ్ ఎంఈఓ శ్రీరాములు, కమిటీ అధ్యక్షులు ఆదినారా యణ, ఉపాధ్యక్షులు శ్రీదేవి, కార్యదర్శి శ్రీనివాస గుప్తా, సంయుక్త కార్యదర్శి రమేష్ బాబు, కార్యవర్గ సభ్యులు నరహర మూర్తి, వెంకటమణప్ప గ్రంథ పాఠకులు పాల్గొన్నారు 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈనెల 14 వ తేదీ నుండి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నాము గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా 14వ తేదీ న బాలల దినోత్సవం 15 వ తేదీ పుస్తక ప్రదర్శన,16వ తేదీ గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులను స్మరించుట, 17 వతేదీ కవి సమ్మేళనం ,18వ తేదీ పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం క్రీడ పోటీలు, 19వ తేదీ మహిళా దినోత్సవం ,20వ తేదీ డిజిటల్ గ్రంథాలయాలపై విద్యార్థులకు అవగాహన జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం ఉంటుందని ఇందులో విద్యార్థులు పుర ప్రజలు పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలనిచేయాలని కోరారు.

# చేనేతకార్మికుడు గుండెపోటుతో మృతి

**ధర్మవరంటౌన్, నవంబరు 13 ప్రభాతవార్త**



ఆలుకుంట్లనరేశ్ (ఫైల్ఫోటో)

పట్టణంలోని శాంతినగర్ కు చెందిన ఆలుకుంట నరేశ్(45) అనే చేనేత కార్మికుడు గుండెపోటుతో మృతిచెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాలమేరకు... గార్లదిన్నె మండలం మర్తాడుకు చెందిన ఆలుకుంట్ల నరేశ్ సొంత మగ్గం సేస్తూ జీవనం సాగించేవాడు. నేసిన చీరలకు గిట్టుబాటు ధర లబించకపోవడంతో సొంత మగ్గాలను అమ్మేసిన కొంచెం అప్పులు తీర్చాడు. ఇంకా అప్పులు ఉండటంతో కూలిమగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. తరచూ అప్పులను ఎలా తీర్చాలో దిక్కుతోచక తీవ్రమనస్థాపపానికి గురయ్యేవాడు. ఈక్రమంలో బుదవారం ఉన్నఫలంగా చాతిలో నొప్పి రావడంతో నరేశ్ కుప్పకూలిపడిపోయాడు. దీంతో వెంటనే బార్య బాగ్యమ్మ చుట్టుపక్కల వారి సాయంతో ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురంకు తరలించగా అక్కడ వైద్యుల సలహా మేరకు బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమద్యంలో మృతిచెందినట్టు కుటుంబసభ్యులుతెలిపారు. మృతునికి భార్యతో కుమార్తె లిఖిత, కుమారుడు పార్థ ఉన్నారు.

# నారాయణ కళాశాలపై చర్యలు తీసుకోవాలి

**గుంతకల్లు,నవంబర్ 13,ప్రభాతవార్త**

పట్టణంలోని నారాయణ కార్పొరేట్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని వైయస్సార్సీపి విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంశీ యాదవ్ అన్నారు. బుధవారం కళాశాల ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా సమయపాలన పాటించకుండా ఇష్టానుసారంగా కళాశాలను నిర్వహిస్తున్నారన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తూ,పాఠ్యపుస్తకాలను అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. యాజమాన్యం ఒత్తిడితట్టుకోలేక విద్యార్థులువిద్యార్థి సంఘాల ను సంప్రదిస్తున్నారని పేర్కొన్నారు. అనేక చోట్ల విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు ఉన్నాయన్నారు. సంబంధిత అధికారులు స్పందించి నారాయణ కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గణేష్, శివ, అజయ్ పాల్గొన్నారు.

# మద్యం మనలోని మానసిక,ఆర్థిక పరిస్థితులను మార్చేస్తాయి

**కసిరెడ్డిపల్లి ఎస్సీ కాలనీలో మత్తు పదార్థాల హానిపై అవగాహన**




కాలనీలో అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు.

**గోరంట్ల నవంబర్ 13 ప్రభాతవార్త**

పట్టణంలోని ఏఎన్ కే డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకు కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఎన్ఎస్ఎస్ క్యాంప్ నాలుగవ రోజులో భాగంగా కసిరెడ్డిపల్లి ఎస్సీ కాలనీలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జి జయప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీలో ప్రజలకు మద్యపానం, డ్రగ్స్ వాడటంవలన కలిగే దుష్ప్రభా వాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్లొగన్స్ తో కాలనీలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు .మద్యం వాడడం వలన మానసిక శారీరక ఆర్థిక సమస్యలు తలెత్తుతాయని కుటుంబంలో సమస్యలు తలెత్తుతాయని అవగాహన కల్పించారు. ముఖ్యంగా యువత డ్రగ్స్ మత్తులో పడకుండా జాగ్రత్తగా ఉండాలని తెలియజేశారు. పొగాకు వాడడం వలన నోటి క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని అది చాలా హానికరమని పోస్టర్స్ తో ప్రజలకు అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు నరసింహప్ప బాబు సుధాకర రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు.

# ఈవోఆర్‌డిగా సుధాకర్ పదవీ బాధ్యతలు స్వీకరణ



బాధ్యతలు చేపట్టిన దృశ్యం

**రొళ్ల నవంబర్13 ప్రభాతవార్త:**

మండల ఈఓఆర్డిగా సుధాకర్ పదవీ బాధ్యతలు చేపట్టారు. అమరాపురం మండలంలో గ్రేడ్1 పంచాయతీ కార్య దర్శిగా పనిచేస్తున్న సుధాకర్ ఈఓఆర్డిగా పదోన్నతి పొంది బదిలీపై రొళ్ల మండలానికి వచ్చారు. ఈమేరకు ఆయన మండల పరిషత్ కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉంటూ మండలంలోని పంచాయతీల అభివృద్ధికి సమర్థవంతంగా పని చేస్తానన్నారు.

# పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎంఈఓ



తనిఖీ చేస్తున్న దృశ్యం

**అగళి, నవంబర్ 13 ప్రభాతవార్త**

ఎస్ఏ-1 పరీక్ష కేంద్రాన్ని ఎంఈఓ-2 చంద్రశేఖర్‌నాయుడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అగళి ఉన్నత పాఠశాలతోపాటు అగళి ఆదర్శ పాఠశాలలో జరిగే ఎస్ఏ-1 పరీక్షలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులు ఎస్ఏ-1 పరీక్షలలో మంచి మార్కులు సాధిస్తే రాబోవు అన్యూవల్ పరీక్షలలో మంచి మార్కులు సాధించ వచ్చని ఇప్పటి నుంచే కష్టపడి ఇష్టంగా చదవాలని ఆయన సూచించారు.

# చట్టపరంగా పిల్లలను దత్తత తీసుకోవాలి

**అంతర్జాతీయ దత్తత మాసం అవగాహన సదస్సు**

**ఐసిడిఎస్ సూపర్వైజర్ నాగరాణి ఆధ్వర్యంలో కార్యక్రమాలు.**



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం.

**గోరంట్ల నవంబర్ 13 ప్రభాతవార్త**

జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రమీల ఆదేశాల మేరకు, జిల్లా బాలల పరిరక్షణ అధికారి మహేష్ ఆదేశాల మేరకు గురువారం సోమందేపల్లి ప్రాజెక్ట్ గోరంట్ల మండల పరిధిలో ఉన్నటువంటి గుడిసెలలో నివసిస్తున్న ప్రజలకు ఐసిడిఎస్ సీడీపీఓ శాంత లక్ష్మి సూచనలతో సూపర్వైజర్ నాగరాణి అధ్యక్షతన కౌన్సిలర్ శివలత అంతర్జాతీయ దత్తతమాసం గురించి వివరించడం జరిగింది. ఇందులో చట్టపరమైన దత్తత గురించి మరియు పిల్లలు లేని దంపతులకి చట్టపరంగా పిల్లలను దత్తత తీసుకోవడం గురించి తెలియజేయడమైనది. మరియు సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ గురించి మరియు స్పెషలైజ్డ్ అడాప్షన్ ఏజెన్సీ గురించి గ్రామ ప్రజలకు పిల్లలను దత్తత తీసుకునే తల్లిదండ్రులు శారీరకంగా, మానసికంగా మరియు భావోద్వేగపరంగా స్థిరంగా, ఆర్థికంగా స్థోమత కలిగి ఉండాలి మరియు వారికి ఎటువంటి ప్రాణాంతకమైన వైద్య పరిస్థితి ఉండకూడదు .ఒంటరి మగ తల్లిదండ్రులు మగ బిడ్డను మాత్రమే దత్తత తీసుకోవచ్చు ఒంటరి మహిళా తల్లిదండ్రులు ఏ లింగానికి చెందిన బిడ్డనైనా దత్తత తీసుకోవచ్చు వివాహిత దంపతులు ఏ లింగానికి చెందిన బిడ్డనైనా దత్తత తీసుకోవచ్చు, వారికి ఇప్పటికే ఏ లింగానికి చెందిన బిడ్డ ఉన్నా లేకపోయినా దత్తత తీసుకోవచ్చు. పిల్లలను దత్తత తీసుకోవడానికి కావలసిన పత్రాలు దత్తత తీసుకునేవారి వ్యక్తిగత గుర్తింపు పత్రాలు, చిరునామా రుజువు, వివాహ ధృవీకరణ పత్రం (వివాహితులైతే), వైద్య ధృవీకరణ పత్రాలు, మరియు ఆదాయ రుజువు పత్రాలు అవగాహన కల్పించడం జరిగింది. నిరాదరణలో ఉన్నటువంటి పిల్లలను మరియు ముళ్ళ పొదల్లోని, చెత్తకుప్పలలోను పిల్లలను గుర్తించిన వెంటనే గ్రామ పరిధిలో ఉన్నటువంటి ప్రభుత్వ యంత్రాంగాలకి తెలియజేయాలని మరియు చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098 కి తెలియజేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శి హేమావతి , ఏఎన్ఎం ఏఎన్ఎం, అంగన్వాడి టీచర్లు ప్రమీల , పద్మావతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు నిరసనగా కోటి సంతకాలు

**అమరాపురం నవంబర్ 13 ప్రభాతవార్త**



వైకాపా నాయకులు దృశ్యం

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను నిరసిస్తూ వైకాపా అధినేత జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు బసవనపల్లిలో వైకాపా సమన్వయకర్త ఈరలక్కప్ప ఆధ్వర్యంలో గురువారం జరిగింది. బసవన పల్లి, ఆరోనపల్లి తాండ గ్రామాల్లో ఏర్పాటుచేసిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం పంచాయతీ వైకాపా కన్వీనర్ శివారెడ్డి, గ్రామపంచాయతీ సర్పంచ్ నరసింహమూర్తిల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైకాపా పంచాయతీ కన్వీనర్ త్రిలోక్నాథ్, ఎంపీపీ ఈరన్న, వైస్ ఎంపీపీ కృష్ణమూర్తి,నియోజకవర్గ ఎస్సీ సెల్ వైకాపా అధ్యక్షుడు ఉప్పార్లపల్లి శివన్న, మాజీ ఎంపీటీసీ కృష్ణారెడ్డి, ఎంపీటీసీ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమా లు వేసి ఘనంగా నివాళులర్పించి ఇంటింటికి వెళ్లి మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు నిరసనగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ప్రతి ఇంటిం టికి వెళ్లి నిర్వహించారు. అనంతరం వైకాపా సమన్వయకర్త ఈరలక్కప్ప మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తక్షణమే వైకాపా ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి ఏర్పాటుచేసిన మెడికల్ కళాశాలల ప్రైవేటీకర ణ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. వైద్య విద్య సామాన్య నిరుపేదలకు అందని ద్రాక్ష పండులా తయారైందన్నారు. కరోనా సమయంలో ఆర్థిక సంక్షోభంలో ఉన్నా కూడా రాష్ట్ర అభివృద్ధికి జగన్ మోహన్ రెడ్డి కృషి చేశారని కొనియాడారు. చంద్రబాబు తల్లి బుల్లి మాటలకు ప్రజలు మోసపోయి కూటమి ప్రభుత్వాన్ని గద్దినెక్కిస్తే నిలువున చంద్రబాబు ప్రజలను మోసగిస్తున్నట్లు ఆయన ఆరోపించారు. కోటి సంతకాల సేకరించి రాష్ట్ర గవర్నర్కు అందిస్తామని ఆయన పేర్కొన్నారు పేర్కొన్నారు. ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని , అందులో భాగంగానే ప్రతి గ్రామంలోనూ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో వైకాపా రైతు విభాగం అధ్యక్షులు నాగిరెడ్డి, ఉపాధ్యక్షులుభోజరాజు, హనుమంతనపల్లి నారాయణ గౌడ్, యూత్ సెక్రెటరీ గోపాల్ కృష్ణ, ఎస్టీ సెల్ పంచాయతీ అధ్యక్షుడు గిరీష్ నాయక్, మాజీ డీలర్ కృష్ణమూర్తి, బసవనపల్లి మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ నాగరాజు, వుదుగూరు నాగరాజు, ప్రధాన కార్యదర్శి సిద్దేశ్, తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయ ఉద్యోగులు బయోమెట్రిక్ హాజరు వేస్తారు..బయట తిరుగుతారు

**- అడిగితే ఫీల్డ్‌కు వెళ్లామని చెబుతారు**

**- ఉన్నతాధికారుల ఆకస్మిక తనిఖీలు కానరావే..!**

**అగళి, నవంబర్ 13 ప్రభాతవార్త**

గత ప్రభుత్వం సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. సచివాలయాల్లో దాదాపు 11 రకాల ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తారు. ఉదాహరణకు ఇంజినీరింగ్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, హార్టికల్చర్, అగ్రికల్చర్, సెరికల్చర్, మహిళా పోలీస్, సర్వేయర్ పంచాయితీ కార్యదర్శి, విఆర్ఓ ఇలాంటి పోస్టులను భర్తీ చేశారు. ఒక్క సచివాలయంలో కూడా పూర్తి సిబ్బంది లేకపోవడంతో ఒకరిద్దరితో నెట్టుకొస్తున్నారు. ఉన్న సచివాలయ సిబ్బంది హాజరు వేస్తారు కానీ బయట తిరుగుతుంటారని మండల ప్రజలు విమర్శిస్తున్నారు. పనుల కోసం సచివాలయాల వద్దకు వెళ్తే ఫీల్డ్ విజిట్ వెళ్లారని చెబుతారు కానీ సంతకం చేయడం బయటికి వెళ్లడం చేస్తున్నారని ఈ బయోమెట్రిక్ వల్ల కూడా సంతకానికి ఉన్న ప్రాధాన్యత ప్రజల పనులపై లేదని, హడావుడిగా సంతకం చేస్తే ఆ రోజు పని అయిపోయినట్లు ఫీల్ అవుతున్నారని, బయోమెట్రిక్‌తోపాటు ఫేషియల్, హాజరు వేసినా మధ్యలో ఉదయం ఉదయం 10:30 తర్వాత, సాయంత్రం 4 వరకు ఉద్యోగులు సచివాలయాల్లో కనిపించకపోతే మేము ఎవరిని అడగాలని, మా పనులు ఎలా జరుగుతాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. బయోమెట్రిక్ వచ్చిన తర్వాత మండల స్థాయి,జిల్లా స్థాయి అధికారుల ఆకస్మిక తనిఖీలకే స్వస్తి పలికినట్లు ఉంది. ఆకస్మిక తనిఖీ చేస్తే వారి ఆటలు బయట పడుతాయి. అటెండెంట్స్ వేయడానికి ఉన్న ప్రాధాన్యత ప్రజలకు చేసే పనులపై లేదని విమర్శలు ఉన్నాయి. బయోమెట్రిక్ సంతకాలు లేనప్పుడు ఉద్యోగుల్లో భయముండేది. ఉన్నతాధికారులు ఎప్పుడు ఆకస్మిక తనిఖీలు చేస్తారో, చర్యలు తీసుకుంటారో అని భయం భయంగా విధులకు హాజరయ్యేవారు, ఇప్పుడు బయోమెట్రిక్ హాజరు వేస్తే అంతా పని అయిపోయినట్లు ఉద్యోగులు అనుకుంటున్నారు. అదే విధంగా కొందరు టీచర్లు సైతం బయోమెట్రిక్ హాజరు వేసి బయట తిరుగుతున్నారని, వేళల్లో విద్యార్థులకు పాఠాలు బోధించక కొందరు ఉపాధ్యాయులు అలా చేస్తారని, విద్యార్థుల తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకుని బయోమెట్రిక్ హాజరు, ఫేషియల్ హాజరును పక్కన పెట్టి ఆకస్మిక తనిఖీలు చేస్తే వారు భయంగా ఉద్యోగాలు చేసి ప్రజలకు పనులు చేసి పెడతారని ఆ విధంగా ఉన్నతాధికారులు ఆకస్మిక తనిఖీలపై దృష్టి సారించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# రోడ్లపై పారుతున్న మురుగునీరు

**కనగానపల్లి నవంబర్ 13 ప్రభాతవార్త**



రోడ్డుపై పారుతున్న మురుగునీరు



తగరకుంట మెయిన్ రోడ్డు గుంతలోకి చేరిన మురుగునీరు

శుక్రవారం మండల పరిధిలోని తగరకుంట గ్రామంలో గత నెల నుండి మెయిన్ రోడ్డు మురికి కాలువను అధికారులు శుభ్రం చేయించకపోవడంతో కాలువ బ్లాక్ కావడంతో రోడ్డుపైన మురుగునీరు పారుతోంది. ఈ రోడ్డు ప్రాంతం ఎక్కువగా వాణిజ్య సముదాయాలు అలాగే జనం రద్దీ కూడా ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ హోటల్,లు దుకాణాలు అలాగే తోపుడు బండ్ల వ్యాపారులు, గ్రామస్తులు మురుగు దుర్గంధ వాసన భరించలేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ మురుగు కాలువను శుభ్రం చేయించండని పంచాయతీ అధికారులకు ఎన్ని మార్లు వారి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మురుగునీరు రోడ్లపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

**బొమ్మనహాళ్ నవంబర్ 13 ప్రభాతవార్త**

బొమ్మనహాళ్ శాఖా గ్రంథాలయంలో శుక్రవారం నుంచి 58 గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించనున్నట్టు బొమ్మనహాళ్ గ్రంథాలయ అధికారి గురువారం ఒక ప్రకటనలో తెలి పారు. ఈ గ్రంథాలయ వారోత్సవాలు నేటి నుంచి 20వతేదీ వరకు జరుగుతాయని, ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ రకాల పోటీలు కూడా నిర్వహిస్తామన్నారు. 14న బాలలదినోత్సవం, 15న పుస్తకప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమాల్లో పాల్గొన్న ప్రముఖులు గురించి 17న కవిసమ్మేళనం, 18నచిత్రలేఖనం, 19న ఉమెన్సో, 20న వారోత్సవాలు ముగింపు ఉంటుందన్నారు.

# నేటి నుంచి 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

### -వారం రోజులపాటు కొనసాగనున్న వివిధ కార్యక్రమాలు

ఉరవకొండ, నవంబర్ 14 ప్రభాతవార్త

ఈనెల 14వ తేదీ (నేటి నుండి) 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు జరుగనున్నాయి. జిల్లా గ్రంథాలయ సంస్థ అదేశాల మేరకు శాఖా గ్రంథాలయంలో వారం రోజులపాటు షెడ్యూల్ మేరకు కార్యక్రమాలు కొనసాగనున్నాయి. 14వ తేదీన శుక్రవారం బాలల దినోత్సవం, గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం కానుండగా 15న శనివారం పుస్తక ప్రదర్శన, పుస్తక పఠన ప్రాముఖ్యతపై అవగాహన, 16న ఆదివారం గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులు, డా॥ఎస్.ఆర్.రంగనాథన్, పోతూరి నాగభూషణం, ఐ.ఎన్.జి.వెంకటరమణయ్యలను స్మరించుకోవడం, 17న సోమవారం కవి సమ్మేళనాలు, సెమినారులు, రచయితల సందేశాలు, 18న మంగళవారం పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు చిత్ర లేఖనం, వ్యాస రచన, వకృత్వ, క్విజ్, క్రీడా పోటీలు, 19న బుధవారం మహిళలకు వివిధ కార్యక్రమాలు, రంగవల్లి, అలికల పోటీలు, 20న గురువారం డిజిటల్ గ్రంథాలయాలపై విద్యార్థులకు అవగాహన, సామూహిక స్వీయ పఠనము (వి లవ్ రీడింగ్) వారోత్సవాల ముగింపు వేడుకలు జరుగనున్నాయి.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఉపాధ్యాయినిలు, ఆటో డ్రైవర్‌కు గాయాలు

### -ఉరవకొండ నుండి చాబాలకు వెళుతుండగా ప్రమాదం

ఉరవకొండ, నవంబర్ 13 ప్రభాతవార్త



గాయపడిన ఉపాధ్యాయులు రాజేశ్వరి, రెహమత్ బేగం దృశ్యాలు

ఆటో బోల్తాపడి ఇద్దరు ఉపాధ్యాయినులతోపాటు ఆటో డ్రైవర్ గాయపడిన ఘటనపై గురువారం ఉదయం ఉరవకొండ రూరల్ సర్కిల్ పరిధిలోని వజ్రకరూరు మండలం చాబాల గ్రామంవద్ద చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన మేరకు వివరాల్లోకి వెళితే... ఉరవకొండ పట్టణానికి చెందిన ఉపాధ్యాయినులు రాజేశ్వరి, రెహమత్ బేగం ఆటోలో తాము పనిచేస్తున్న చాబాల జెడ్పీ ఉన్నత పాఠశాలకు ఆటోలో బయలుదేరారు. వారు ప్రయాణిస్తున్న ఆటో చాబాల గ్రామ సమీపంలోకి చేరుకోగానే ఉన్నఫలంగా అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ఉపాధ్యాయినులు రాజేశ్వరి, రెహమత్ బేగం, ఆటో డ్రైవర్ అల్లాబకాష్ గాయపడ్డారు. దీంతో వారిని 108 అంబులెన్స్ ఉరవకొండ ఆసుపత్రికి తీసుకురాగా ఇక్కడ వైద్యం అందించారు. ఘటనపై పోలీసులు ఆరా తీసారు.



గాయపడిన ఆటో డ్రైవర్ అల్లాబకాష్

# రేపు ఉరవకొండ మేజర్ గ్రామ పంచాయతీ సాధారణ సమావేశం

### -పంచాయతీ కార్యదర్శి ఎ.గౌస్‌సాహెబ్

ఉరవకొండ, నవంబర్ 13 ప్రభాతవార్త

ఉరవకొండ మేజర్ గ్రామ పంచాయతీ సాధారణ సమావేశం ఈనెల 15వ తేదీన శనివారం ఉదయం 11 గంటలకు పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ మీనుగ లలిత అధ్యక్షతన జరుగుతుందని పంచాయతీ కార్యదర్శి ఎ.గౌస్‌సాహెబ్ తెలిపారు. సమావేశానికి పంచాయతీ వార్డు సభ్యులు తదితరులు హాజరుకావాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

# పేదలకు విద్య, వైద్యం అందకుండా చేస్తున్నారు

### వైఎస్సార్సీపీ ప్రజా ఉద్యమం, కోటి సంతకాల సేకరణ

గుమ్మఘట్ట నవంబరు 13 ప్రభాతవార్త



కోటి సంతకాల సేకరణ కార్యక్రమం లో పాల్గొన్న వైకాపా నాయకులు

పేదలకు విద్య, వైద్యం ఉచితంగా అందాలని ఎంతో ముందు చూపుతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో రూ.8.400కోట్ల వ్యయంతో 17 మెడికల్ కాలేజీలను నిర్మించాలని చర్యలు చేపడితే, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వాటిని ప్రైవేటీకరణ చేసి చరిత్రహీనుడిగా మారి పేదలకు తీవ్ర అన్యాయం చేశారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మెట్టు విశ్వనాథ రెడ్డి విమర్శించారు. చంద్రబాబు ప్రభుత్వం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ చర్యను నిరిసిస్తూ గురువారం మండల కేంద్రము లోని వైఎస్సార్ విగ్రహానికి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాయదుర్గం నియోజకవర్గం సమన్వయకర్త మెట్టు గోవింద రెడ్డి తనయుడు రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మెట్టు విశ్వనాథ రెడ్డి మండల కన్వీనర్ గౌని లక్ష్మి కాంతరెడ్డి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో గత మూడేళ్ల వ్యవధిలో 17మెడికల్ కాలేజీలను నిర్మించేలా చర్యలు చేపట్టి దేశ వ్యాప్తంగా ఆదర్శంగా నిలిచారన్నారు. జగన్ సంకల్పం సాకారమై ఉంటే ఎంతో మంది పేద విద్యార్థులకు ఉచితంగా వైద్య విద్య అందేదన్నారు. అలానే ఎంతో మంది పేద రోగులకు ఉచితంగా నాణ్యమైన వైద్యం అంది ఉండేదన్నారు. పీపీపీ (పబ్లిక్, ప్రైవేట్, పార్టనర్‌షిప్) విధానంలో అతి తక్కువ ధరకు ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పడం ద్వారా పేదలకు సాయం అదే పరిస్థితి లేదన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకోసం వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా ఉద్యమం, కోటి సంతకాల సేకరణ ఒక కార్యక్రమం కాదని కోట్లాది మంది ప్రజల మనోభావాలను ప్రతిబింబిస్తుందన్నారు. నియోజకవర్గం నుంచి దాదాపుగా వేల సంఖ్యలో పైగా కోటి సంతకాల సేకరణ చేపట్టామని త్వరలో మరింతమందితో కార్యక్రమం నిర్వహించి పంపడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకుడు వైసిపి రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మెట్టు విశ్వనాథ రెడ్డి మండల కన్వీనర్ గౌని లక్ష్మి కాంతరెడ్డి ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బిటిపి గోవింద,తాళ్ళకేర వీరభద్ర రెడ్డి, గుమ్మఘట్ట కృష్ణ మీణ, రాఘవేంద్ర, డీలర్ రామాంజనేయులు కలుగోడు కాంతరెడ్డి, బేలోడు రామాంజనేయులు సర్పంచులు రమేష్,ఉమేష్, రాజేష్, అనిల్,బిటిపి వన్నూరుస్వామి, హనుమంతు,వైఎస్సార్సీపీ కమిటి సభ్యులు, జిల్లా కమిటి సభ్యులు, నియోజకవర్గ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తా రాష్ట్ర ఎస్సీ సెల్ సెక్రెటరీ చౌడప్ప

ధర్మవరంటౌన్ నవంబర్ 13 ప్రభాతవా



వైయస్ జగన్ ను మర్యాదపూర్వకంగా కలిసిన రాష్ట్ర ఎస్సీ సెల్ సెక్రెటరీ చౌడప్ప

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ని రాష్ట్ర ఎస్సీ సెల్ సెక్రటరీ చౌడప్ప మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇటీవల రాష్ట్ర ఎస్సీ సెల్ సెక్రటరీగా ఎన్నికైన అనంతరం, చౌడప్ప మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చౌడప్ప మాట్లాడుతూ వైయస్ జగన్ నాయకత్వం వల్లనే తాను రాజకీయ ప్రస్థానంలో ఎదగగలిగాను. ఆయన చూపిన మార్గంలోనే ఎస్సీ వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తానని తెలిపారు. వైయస్ జగన్ చౌడప్పను అభినందిస్తూ, పార్టీ బలోపేతానికి, ఎస్సీ వర్గాల సంక్షేమానికి కృషి కొనసాగించాలని సూచించారు. సమావేశంలో ఎస్సీ సెల్ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# మెగాజాబ్ మేళాకు విశేషస్పందన



మాట్లాడుతున్న షిర్డీసాయిబాబా సేవాసమితి అధ్యక్షులు వీరనారాయణ

ధర్మవరంటౌన్, నవంబరు 13 ప్రభాతవార్త

పట్టణంలోని షిర్డీసాయిబాబా ఆలయ ఆవరణంలోని కల్యాణమండపంలో గురువారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లబించినట్టు ఆలయ సేవాసమితి అధ్యక్షుడు వీరనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆన్‌లైన్‌లో ఇంటర్మీడియట్, డిగ్రీ అర్హత కలిగినవారు 65మంది దరఖాస్తు చేసుకోగా ఇంటర్వ్యూలో 54 మంది అభ్యర్థులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎల్‌ఎంఎస్ కంపెనీ నిరుద్యోగులకు చక్కటిఅవకాశాన్ని కల్పించడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌ఎంఎస్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ అస్లాం, షిర్డీసాయి బాబాసేవాసమితి కార్యదర్శి రామలింగయ్య, ఉపాధ్యక్షులు నారాయణరెడ్డి, సహకార్యదర్శి నాయుడు,. కోశాదికారి సూర్యనారాయణ, డైరెక్టర్లు సూర్యప్రకాశ్, హేమంతకుమార్, ఎల్‌ఎంఎస్ కంపెనీ ప్రతినిదులు షామీర్, ఇమ్రాన్, సూపర్వైజరు లు పాల్గొన్నారు.

# వైయస్ జగన్‌ను కలిసిన రాష్ట్ర ప్రచార కార్యదర్శి చెలిమి రామయ్య

ధర్మవరంటౌన్ నవంబర్ 13 ప్రభాతవార్త



వైయస్సార్సీపి అధినేత మాజీ ముఖ్యమంత్రిని కలిసిన రాష్ట్ర ప్రచార కార్యదర్శి చెలిమిరామయ్య

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ని రాష్ట్ర ప్రచార కార్యదర్శి చెలిమి రామయ్య మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల జరిగిన పార్టీ నియామకాలలో చెలిమి రామయ్యను రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా ఎన్నుకోవడం జరిగిన విషయం తెలిసిందే. తన నియామకానికి దోహదపడిన నాయకత్వానికి కృతజ్ఞతలు తెలియజేయడానికి చెలిమి రామయ్య వైయస్ జగన్‌ను కలుసుకున్నారు. ఈ సందర్భంగా చెలిమి రామయ్య మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ దూరదృష్టి, ప్రజల పట్ల ఉన్న ప్రేమ నాకు ప్రేరణగా నిలుస్తుంది. ఆయన ఆలోచనలతో ముందుకు సాగుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. వైయస్ జగన్ చెలిమి రామయ్యను అభినందిస్తూ, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి చేర్చేందుకు మరింత చురుకుగా పనిచేయాలని సూచించారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పశువుల గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరం నిర్వహించిన పశు వైద్యులు

తాడిమర్రి నవంబర్ 13 (ప్రభాతవార్త)



పశువులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

మండల పరిధిలోని పెద్దకోట్ల గ్రామంలో గురువారం రాష్ట్రీయ గోకుల్ మిషన్ మరియు జిల్లా పశుగణాభివృద్ధి సంఘం, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంఘం కార్యనిర్వాహణాధికారి డాక్టర్ వెంకటేష్, బత్తలపల్లి ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ యూనస్, డాక్టర్ గురునాథరెడ్డి, డాక్టర్ శ్రీకాంత్, తదితరులు హాజరై సుమారు 76, పాడి పశువులకు గర్భకోశ చికిత్సలు నిర్వహించారు. అనంతరం పశువులకు తగిన మందులు ఉచితంగా సరఫరా చేశారు. అలాగే పిడుదులు, గోమార్లతో బాధపడుతున్న పశువులకు మందును స్ప్రే చేశారు. ఈ సందర్భంగా పాడి పరిశ్రమపై ఆధారపడి ఉన్న రైతులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి తగిన సూచనలు సలహాలు ఇచ్చారు.

# నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

ధర్మవరంటౌన్, నవంబరు 13 ప్రభాతవార్త

ధర్మవరం శాఖా గ్రంథాలయంలో గురువారం నుంచి 58 గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించనున్నట్టు గ్రంథాలయ అధికారిణి అంజలి సౌభాగ్యవతి గురువారం ఒకప్రకటనలో తెలిపారు. ఈ గ్రంథాలయ వారోత్సవాలు నేటినుంచి 20వతేదీవరకు జరుగుతాయని, ఈసందర్భంగా విద్యార్థులకు వివిధరకాల పోటీలుకూడా నిర్వహిస్తామన్నారు. 14న బాలలదినోత్సవం, 15న పుస్తకప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమాల్లో పాల్గొన్న ప్రముఖులు గురించి 17న కవిసమ్మేళనం, 18నచిత్రలేఖనం, 19న ఉమెన్సో, 20న వారోత్సవాలు ముగుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది రమణానాయక్, రాము, సరస్వతమ్మ, గంగాధర్ పాల్గొన్నారు.

# ఎన్. తిమ్మాపురంలో స్వామిత్వ ప్రత్యేక గ్రామసభ

### లబ్ధిదారులకు ప్రాపర్టీ పార్సల్ మ్యాప్‌ల పంపిణీ




గ్రామ సభలో మాట్లాడుతున్న ఇంచార్జీ ఎంపీడీఓ సత్య బాబు

విడపనకల్లు నవంబరు 13 ( ప్రభాత వార్త )

మండలం పరిధిలోని ఎన్. తిమ్మాపురం గ్రామం నందు గురువారం ఖిస్వామిత్వఖి ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈగ్రామసభలో లబ్ధిదారులకు ప్రాపర్టీ పార్సల్ మ్యాప్‌లు పంపిణీ కార్యక్రమాన్ని అధికారులు చేపట్టారు. గ్రామసభలో, లబ్ధిదారులకు పంపిణీ చేసిన పీ.పీ.ఎంలను అధికారులు వివరంగా వివరించారు. సర్వే ప్రక్రియ పూర్తయిన తర్వాత తమకు కేటాయించిన పటాలలో లేదా సరిహద్దులలో ఏవైనా ఇబ్బందులు లేదా పొరబాట్లు ఉన్నట్లు లబ్ధిదారులు గుర్తించినట్లయితే, వాటిని ఒక వారం రోజుల లోగా సంబంధిత అధికారులకు తెలియజేసి సరిదిద్దుకోవాలని ఈ సందర్భంగా తెలియజేశారు. సర్వేవివరాలు పూర్తిపారదర్శకంగా ఉండటానికి ఈ సమయం ఎంతగానో ఉపయోగపడుతుందని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా హాజరైన అధికారులు స్వామిత్వ పథకం యొక్క ముఖ్య ఉద్దేశాలు, లబ్ధి, మరియు ఆస్తి హక్కు పత్రాల ప్రాముఖ్యత గురించి గ్రామ ప్రజలకు సమగ్రంగా వివరించారు. ఈ కార్యక్రమం లో ఇంచార్జీ మండల పరిషత్ అభివృద్ధిఅధికారి ఏ.సత్యబాబు, పరిపాలనాధికారి ఎం. భాస్కర్ బాబు, గడేకల్లు గ్రామ కార్యదర్శి జి. సోమయ్య, గ్రామ పెద్దలు, సచివాలయ సిబ్బంది మరియు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అధినేత జగన్ తో సోషల్ మీడియా కన్వీనర్

ధర్మవరంటౌన్ నవంబర్ 13 ప్రభాతవార్త



మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డితో ధర్మవరం పట్టణ సోషల్ మీడియా కన్వీనర్

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డిని ధర్మవరం పట్టణ సోషల్ మీడియా కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా జగనన్నను మర్యాదపూర్వకంగా కలిసి ఆయన నాయకత్వం పట్ల తన అభిమానాన్ని వ్యక్తం చేశారు. పార్టీ బలోపేతం కోసం సోషల్ మీడియా వేదికగా చేస్తున్న తన సేవలను వివరించారు. జగనన్నతో భేటీ సందర్భంగా పార్టీ భవిష్యత్ వ్యూహాలు, ప్రజలకు చేరువ కావడంపై చర్చించారు. రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రత్యేకంగా రాష్ట్రంలో సోషల్ మీడియా సోదరుల పై జరుగుతున్న అక్రమ అరెస్టులు పలు విషయాలపై చర్చించారు. రాబోయే రోజుల్లో సోషల్ మీడియా సోదరులకు సమావేశం నిర్వహించడం జరుగుతుంది అని తెలిపారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని తెలిపారు.

# మంత్రి సత్య కుమార్ చొరవతో తాగునీటి సమస్యకు పరిష్కారం

### మండల కన్వీనర్ దేవర రామ్మోహన్



బోరు బావిలోకి కొత్త మోటారు దింపుతున్న గ్రామస్తులు, బిజెపి నాయకులు

తాడిమర్రి నవంబర్ 13 (ప్రభాతవార్త)

మండల పరిధిలోని సీసీ రేవు గ్రామ పంచాయతీ మర్రి మేకలపల్లి ఎస్సీ కాలనీ లో రెండు మోటర్లు మూడు నెలలుగా మోరాయిస్తుండటంతో ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య ఉండడంతో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ దృష్టికి మండల బిజెపి నాయకులు తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి ఎస్సీ కాలనీకి లక్షల రూపాయలు వ్యయంతో రెండు మోటర్లు, స్టాటర్లు, కేబుల్ వైర్ వెంటనే మంజూరు చేశారు. మంత్రి సత్వరమే స్పందించి నీటి సమస్య తీర్చినందుకు మర్రిమేకలపల్లి గ్రామస్తులు మంత్రి సత్య కుమార్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ దేవర రామ్మోహన్ మర్రి మేకల పల్లి ఎక్స్ ఎంపీటీసీ గంగయ్య, గోవిందు గంగులప్ప, గ్రామస్తులతో పాటు బిజెపి నాయకులు పాల్గొన్నారు

# వైసీపీని వీడి టీడీపీలో చేరిక

పరిగి నవంబర్ 13 (ప్రభాత వార్త )



టీడీపీ పార్టీ తీర్థం పుచ్చు కొన్న కాలువపల్లి గ్రామస్థులు

శ్రీ సత్య సాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గం పరిగి మండలం కాలువ పల్లి గ్రామానికి చెందిన 10 వైసీపీ కుటుంబాలు తెలుగుదేశం పార్టీలోకి చేరారు వారికి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించిన రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రివర్యులు శ్రీమతి సవితమ్మ సత్య సాయి జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప తదితరులు తదనంతరం చేరిన కార్యకర్తలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు సంక్షేమ పథకాలు చూసి టీడీపీ పార్టీలో చేరినట్లు తెలియా జేశారు పార్టీ లోకి చేరినవారు అశ్వర్థప్ప., అంజినేయులు, శంకరప్ప, అశ్వర్థప్ప, దొడ్డయ్య, తిమ్మయ్య, శివప్రసాద్, మల్లికార్జున, నాగేశ్వరరావు, ముద్దయ్య...

# మండల గ్రామ రెవిన్యూ అధికారుల కమిటీ ఎన్నిక

### మండల అధ్యక్షునిగా ప్రభాకర్ రావు ఎన్నిక.

గోరంట్ల నవంబర్ 13 ప్రభాతవార్త



ఎన్నిక అయినా నూతన కమిటీ సభ్యులు.

గోరంట్ల మండల గ్రామ రెవిన్యూ అధికారుల నూతన మండల కమిటీని గురువారం ఏకగ్రీవ ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని తాసిల్దార్ కార్యాలయంలో నూతన ఎన్నిక కమిటీ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. నూతన కమిటీ ఎన్నిక.. గ్రామ రెవిన్యూ అధికారుల సంఘం గోరంట్ల మండలం అధ్యక్షునిగా పులేరు వీఆర్వో కరణం నాగరాజరావు, ఉపాధ్యక్షునిగా పట్టణంలోని 5వ సచివాలయం వీఆర్వో లక్ష్మీనారాయణ ను, ప్రధాన కార్యదర్శిగా మల్లాపల్లి వీఆర్వో పవన్ కుమార్ ను, ట్రెజరర్ గా కొండాపురం వీఆర్వో ప్రవీణ్ కుమార్ ను, సంయుక్త కార్యదర్శిగా మల సముద్రం వీఆర్వో లక్ష్మీనరసమ్మలతోపాటు పూర్తిస్థాయి మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

# డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పై వ్యాఖ్యలకు ఖండన

బుక్కపట్నం, నవంబర్ 13, ప్రభాతవార్త

నల్లమాడలో జరిగిన వైఎస్ఆర్సిపి సభ లో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పై పుట్టపర్తి నియోజకవర్గం వైఎస్ఆర్సిపి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యల పట్ల బుక్కపట్నం మండలం జనసేన నాయకులు తీవ్రంగా ఖండించారు. మండల కేంద్రమైన జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన నాయకులు కార్యకర్తలు కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి గత ఐదు సంవత్సరాలు చేసింది ఏమీ లేదని, అందుకే పుట్టపర్తి నియోజకవర్గ ప్రజలందరూ మంచి గిఫ్ట్ ఇచ్చారన్నారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన భగవాన్ సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో జరుగుతున్న సందర్భంలో ప్రజలను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయడం పద్ధతి కాదన్నారు. వెంటనే ఆయన చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని జనసేన నాయకులు డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల కన్వీనర్ జయరాం, బుక్కపట్నం చెరువు నీటి సంఘం ఉపాధ్యక్షుడు సంజీవ రాయుడు, టౌన్ కన్వీనర్ దాసరి శ్రీనివాసులు, తోట అనిల్, బుచ్చయ్య గారి పల్లి ఆంజనేయులు, మన్సూర్ భాష, సుంకు ఆంజనేయులు, సుంకు మహేష్, జంగంశీన, జంగం వెంకటేశులు, వంకాయల ఈశ్వరప్ప ,దేశెట్టి శివయ్య, సంకునాగభూషణ్, బివారధి నాగభూషణ, బోడపాటి సాయికుమార్, కె రాజేష్, ఆటో రాము, డి .నాగభూషణ జనసేన నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సికె పల్లిలో నేడే ప్రజాదర్బార్

### - మండల కన్వీనర్ ముత్యాల రెడ్డి

చెన్నేకొత్తపల్లి, నవంబర్ 13 ప్రభాతవార్త

మండల కేంద్రమైన చెన్నె కొత్తపల్లి మండల పరిషత్ కార్యాలయం నందు శుక్రవారం ప్రజల సమస్య పరిష్కారం కొరకు రాప్తాడు శాసనసభ్యురాలు పరిటాల సునీతమ్మ ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ ముత్యాల రెడ్డి ఒక ప్రకటనలు తెలియజేశారు, ఈ సందర్భంగా చెన్నేకొత్తపల్లి మండలానికి సంబందించిన ప్రజా సమస్యలను తెలుసుకొని పరిష్కరించడానికి శాసనసభ్యురాలు, పరిటాల సునీతమ్మ శుక్రవారం మధ్యాహ్నం 1.00గంటకు చెన్నేకొత్తపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తారు. కావున ప్రజలు సమస్యలను అర్జీ రూపంలో వ్రాసుకొని దానికి, వారి ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్‌తో పాటు ఇతర వివరాలను వివరంగా జత చేయాలని ఈ సందర్భంగా తెలియజేశారు.

# ఆర్ అండ్ బి మార్గమధ్యలో పడిన గుంత

### ఆదమరిస్తే అంతే గతి



ఆర్ అండ్ బి కి పెద్ద బొక్క

కనేకల్లు మే నవంబర్ 13 ప్రభాతవార్త

రాయదుర్గం నియోజకవర్గం కనేకల్ మండలం నుండి బెనికల్ , ఎస్ ఆర్ ఎన్ క్యాంపు మీదుగా బళ్లారికి వెళ్లే మెయిన్ ఆర్ అండ్ బి మార్గమధ్యలో బెనికల్ వంక దగ్గర తారు రోడ్డు మధ్యలో పెద్ద గొయ్యి ఏర్పడింది. ఈరోడ్డు మార్గాన వందల మంది ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, ఆర్టీసీ బస్సులు ప్రతిరోజు తిరుగుతుంటాయి. చుట్టుపక్కల గ్రామాల నుండి వ్యవసాయ దారులు వ్యవసాయ పనుల కొరకు కూడా పగలు రాత్రి అనే బేధాలు లేకుండా ఈ మార్గాన ప్రయాణిస్తుంటారు. ప్రమాదం జరగకముందే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.

# బెస్ట్ టీచర్ పురస్కారం అందుకున్న గోరంట్ల ఉర్దూ స్కూలు టీచర్

### అభినందించి సత్కరించిన తోటి ఉపాధ్యాయులు

గోరంట్ల నవంబర్ 13 ప్రభాత వార్త



అవార్డు గ్రహీత సన్మానిస్తున్న ఉపాధ్యాయులు.

భారతరత్న మోలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా జాతీయ విద్యా దినోత్సవం మరియు మైనారిటీ సంక్షేమ దినోత్సవం రోజున, జిల్లా కేంద్రం పుట్టపర్తిలో నిర్వహించిన కార్యక్రమంలో, జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాల, గోరంట్ల ఉపాధ్యాయురాలు పఠాన్ రుబీనాకు ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయురాలిగా పురస్కారం లభించింది. ఈ సందర్భంగా గురువారం జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో, ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి అధ్యక్షతన నిర్వహించిన అభినందన సభలో, పాఠశాల ఉపాధ్యాయులు మరియు ఎస్.ఎం.సి కమిటీ ఛైర్మన్ ఆయేషా సోషల్ అసిస్టెంట్ రుబీనా టీచర్ను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించి, బహుమతులతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో "రూటా" రాష్ట్ర నాయకులు ఫిరోజ్ అహ్మద్, ఉపాధ్యాయులు మసియుల్లా, ప్రతిభా భారతి, మహబూబ్ బాషా, ఆరిఫ్ అలీ, యాకూబ్, అల్లాబక్ష్, సుగుణమ్మ, రవీంద్ర నాయక్ పీ.డి.తదితరులు పాల్గొన్నారు.

# రహదారికి ఇరు వైపులా బారికేడ్లను ఏర్పాటు చేయండి

రొళ్ల నవంబర్13 ప్రభాత వార్త:



హ్యూమన్ రైట్స్ చంద్ర బసప్ప

నేషనల్ హైవే 544 రహదారిలో కోడికొండ చెక్ పోస్ట్ మడకశిర మీదుగా కర్ణాటక శిర వరకు రహదారికి ఇరు వైపులా బారికేడ్లను ఏర్పాటు చేయాలనీ నేషనల్ హైవే అథారిటీ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు హ్యూమన్ రైట్స్ చంద్ర బసప్ప పేర్కొన్నారు. స్పందించిన అధికారులు సంబంధించిన శాఖకు బదిలీ చేసి వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు. ఇప్పటివరకు జాతీయ రహదారికి ఇరువైపులా పలు గ్రామ పరిధిలో చాలా ప్రమాదాలు జరిగాయని ఈ ప్రమాదాలలో చాలా మరణాలు సంభవించయన్నారు. ఈ ప్రమాదాల్లో కొంతమంది వికలాంగులు అయ్యారనీ గుర్తు చేశారు. వెంటనే నేషనల్ హైవే అథారిటీ అధికారులు బారికేడ్లను ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలను, మూగ జీవాల ప్రాణాలను కాపాడాలని కోరినట్లు తెలిపారు.

# వెలుగులీనుతున్న ప్రశాంతి నిలయం

పుట్టపర్తి రూరల్ నవంబర్ 13 ప్రభాతవార్త



విద్యుత్ దీప కాంతులతో యజుర్వేద మందిరం

సత్య సాయి బాబా శత జయంతి ఉత్సవాల సందర్భంగా ప్రశాంతి నిలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.



దీప కాంతులతో వెలుగుతున్న ప్రశాంతి నిలయ ద్వారం.

సాయంత్రం 6 గంటల నుండి తెల్లవారు వరకు విద్యుత్ దీప కాంతుల్లో ప్రశాంతి నిలయం వెలుగులీనుతోంది. భక్తుల రద్దీకు తగ్గట్టుగా సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ఏర్పాట్లను చేపట్టింది. బాబా మహా సమాధి తో పాటు యజుర్వేద మందిరం సర్వమత స్తూపం ట్రస్ట్ కార్యాలయాలు సాయకులవంత హాలు ప్రధాన రహదారి, గోపురముఖ ద్వారం, వినాయక ,సుబ్రహ్మణ్య ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. పచ్చికబైళ్ళలో ఏర్పాటుచేసిన సత్యసాయి శతజయంతి లోగో విగ్రహంతో ఫోటోలు తీసుకోవడానికి భక్తులు పోటెత్తారు. రంగురంగుల విద్యుత్ దీప కాంతులతో పుట్టపర్తి మరియు పరిసర ప్రాంతాలు రంగుల మయంగా మారాయి. సత్యసాయి దర్శనానికి వచ్చిన భక్తులు ఏర్పాట్లను చూసి పరవశించిపోతున్నారు.

# విఘ్నేశ్వర ఆలయంలో వార్షిక సదస్సు

బెలుగుప్ప, నవంబర్ 13 ప్రభాతవార్త



యజ్ఞం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మండల కేంద్రంలో విఘ్నేశ్వర ఆలయంలో గురువారం వినాయకుడికి వార్షిక సదస్సును ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు. వినాయకునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, నవగ్రహ హోమాలు నిర్వహించారు. వచ్చిన భక్తాదులు భక్తి శ్రద్దలతో మొక్కులు తీర్చుకున్నారు. పూజారి రాంబాబు ఆధ్వర్యంలో యజ్ఞ యాగాలు ఏర్పాటు చేసి మంత్రాలను ఉచ్చరించారు. వచ్చిన భక్తాదులందరికీ తీర్థప్రసాదాలను అందజేశారు.

